

వర్షాకాలంలోనూ.. నీటి కష్టాలు

నిండని కావేరి జలాశయాలు



- తమిళనాడుకు రోజూ ఒక టీఎంసీ విడుదలకు 'మండలి' ఆదేశం
- రేపు అఖిలపక్ష భేటీకి సీఎం పిలుపు
- సుప్రీంలో పిటిషన్ వేసే యోచన

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): వరుణుడు కరుణించాడు. రాష్ట్రంలో ప్రత్యేకించి బెంగళూరు, మైసూరు ప్రాంతాలకు చెందిన లక్షలాది మందికి తాగునీరు, వేలాదిమంది రైతులకు సాగునీరు కల్పించే కావేరి నదికి అనుబంధంగా నాలుగు జలాశయాలు ఉన్నాయి. కావేరి తీరంతోపాటు ఎగువన ఉండే కేరళ రాష్ట్రంలో నెలరోజులుగా వర్షాలు కురుస్తున్నా జలాశయాలు పూర్తిగా నిండలేదు. దాదాపు ఏడెనిమిది నెలలు నీరు లేక వెలవెలబోయిన జలాశయాలకు ఇప్పుడిప్పుడే జలకళ వస్తోంది. అంతలోనే కావేరి నీటి నియంత్రణా మండలి రాష్ట్రానికి, కావేరి నీటిపై ఆధారపడినవారికి షాక్ ఇచ్చింది. ఈనెల 12వ తేదీ నుంచి తమిళనాడుకు నెలాఖరుదాకా ప్రతిరోజూ ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో గురువారం జరిగిన 98వ కావేరి నీటి నియంత్రణా మండలి ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వాదనలు వినిపించింది. కేఆర్ఎస్, కబిని జలాశయాలు పూర్తిగా నిండలేదని, జూలై ఆఖరుదాకా ఎటువంటి నిర్ణయాలు తీసుకోరాదని వివరించింది. గత ఏడాది కావేరి తీరంలో నీరులేక తాగునీటికి ఇబ్బంది పడిన పరిస్థితిని తెలిపింది. అయినా కావేరి నీటి నియంత్రణా మండలి ఈనెల 12 నుంచి నెలాఖరుదాకా ప్రతిరోజూ ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. కావేరి నదికి అనుబంధంగా కేఆర్ఎస్, కబిని, హేమావతి, హారంగి జలాశయాలు ఉన్నాయి. నాలుగు జలాశయాలలోనూ 69 టీఎంసీల నీరు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 45 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. డెడ్‌స్టోరేజ్ మినహాయిస్తే నాలుగు జలాశయాల నుంచి 52 టీఎంసీలను మాత్రమే వినియోగానికి సాధ్యం కానుంది. కావేరి తీరంలో ఇటీవల ఉత్తమమైన వర్షాలతో ఇన్‌ఫ్లో పెరుగుతోంది. వర్షం తగ్గితే ఇన్‌ఫ్లో తగ్గే అవకాశాలు ఉన్నాయి. కేఆర్ఎస్ జలాశయం నుంచి సాధారణంగానే 500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంటుంది. ప్రస్తుతం 2వేల క్యూసెక్కులు విడుదలవుతోంది. కేఆర్ఎస్ నుంచి జూన్ 8 నుంచి 15వరకు వీసీ కాలువలకు రోజూ 3వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కావేరి నీటి నియంత్రణా మండలి సిఫారసులతో రోజూ ఒక టీఎంసీ నీరు విడుదల చేయడం అనివార్యమవుతోంది. తాగు, సాగునీటికి రిజర్వు చేసి ఆదేశాలు పాటించాల్సిన ఒత్తిడి రాష్ట్ర ప్రభుత్వంపై ఏర్పడింది. కేఆర్ఎస్‌లో ప్రస్తుతం 26 టీఎంసీల నీరు నిల్వ ఉండగా వినియోగానికి 17 టీఎంసీలు మాత్రమే సాధ్యం కానుంది. కబినిలో 18 టీఎంసీలు ఉండగా 15 టీఎంసీలు మాత్రమే వాడేందుకు వీలుంది. కావేరి పరిధిలోని నాలుగు డ్యామ్‌ల ద్వారా డెడ్ స్టోరేజ్ పక్కన పెడితే వినియోగానికి 52 టీఎంసీలు మాత్రమే వీలుంది. 20 రోజులపాటు 20 టీఎంసీలు విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా నీటి విడుదల నిర్ణయంపై డీసీఎం, జలవనరులశాఖ మంత్రి డీకే శివకుమార్ శుక్రవారం జలవనరుల విభాగం అధికారులతో చర్చలు జరిపారు.

సుప్రీంలో పిటిషన్

కావేరి నీటి నియంత్రణా మండలి రోజుకో టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేయడంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. శుక్రవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కావేరి జలాశయాల్లో ఆశించినంత మేర నిల్వలు లేవని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వర్షం బాగా కురుస్తోందని అనిపించినా 28 శాతం లోటు ఉందన్నారు. నెలాఖరుదాకా వేచిఉంటే బాగుంటుందని సీడబ్ల్యూఆర్సీ ముందు విన్నవించామన్నారు. అయినా ఆదేశాలు జారీ చేశారన్నారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పిటిషన్ దాఖలు చేస్తామన్నారు.

రేపు అఖిలపక్ష భేటీ

కావేరి జలాశయాల నుంచి నీటి విడుదలకు సంబంధించిన ఆదేశాలతో రాష్ట్రానికి నష్టమని భావించిన ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష భేటీకి సిద్ధమైంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు కేంద్రమంత్రులతోపాటు కావేరి పరిధిలోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు రాష్ట్రానికి సంబంధించిన ఎమ్మెల్యేలతో చర్చలు జరపనున్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెల్లడించారు. కేంద్రమంత్రులు కుమారస్వామితోపాటు అందరినీ ఆహ్వానిస్తున్నారు. కావేరి జలాశయాలకు సంబంధించి కుమారస్వామిదే కీలక భూమిక కానుంది. ప్రస్తుతం కుమారస్వామి మండ్య ఎంపీగా వ్యవహరిస్తుండడం, ఇదే జిల్లాలోనే కేఆర్ఎస్ ప్రాజెక్టు ఉండడం ప్రాధాన్యం సంతరించుకుంది. అఖిలపక్ష భేటీలో తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి.


అధికారులు, మంత్రులతో సమావేశమైన సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

బీపీఎల్ లబ్ధిదారులకు షాక్

- భారీగా అనర్హుల గుర్తింపు
- 3 లక్షలకుపైగా కార్డుల రద్దు
- రేషన్ షాపులు, కార్యాలయాల వద్ద జనం క్యూ



బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీపీఎల్ కార్డు ఉంటే ప్రభుత్వ గ్యారెంటీలతో పాటు వైద్యం, విద్యతోపాటు ఎన్నో సౌలభ్యాలు ఉంటాయని మధ్యతరగతి కుటుంబీకులు కూడా పొందారు. ఇలా బీపీఎల్ కార్డు కల్గిన వారు ఆసుపత్రులలో ఉచిత వైద్యంతోపాటు దశాబ్దాలకాలంగా ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రారంభించిన ఐదు గ్యారెంటీలకు బీపీఎల్ కార్డు కీలకమైంది. దీంతో బీపీఎల్ కార్డు ఉంటేనే ఏదైనా సాధ్యమని ప్రజలు భావిస్తున్నారు. బీపీఎల్ కార్డు ద్వారా బియ్యం పొందడం మాత్రమే కాదు వైద్య ఖర్చులు, వ్యవసాయ రుణం, సబ్సిడీ పథకాలు, హౌసింగ్‌తోపాటు ప్రభుత్వ సౌలభ్యాలు సాధ్యమవుతాయి. బీపీఎల్ కార్డు ఉంటే కేన్సర్, కిడ్నీ జబ్బులకు భారీగా పెట్టుకోవాల్సిన ఫీజులకు ఉచిత చికిత్సలు లభించనున్నాయి. ఇది పేదలకు మాత్రమే కాదు. మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా ఉంది. అందుకే తప్పుడు రికార్డులు సమర్పించి అయినా బీపీఎల్ కార్డులను పొందినవారు ఉన్నారు. ప్రభుత్వం ఒక్కసారిగా బీపీఎల్ కార్డుదారులకు షాక్ ఇచ్చింది. సొంత కార్లు, స్థలాలు, ఇళ్లు ఇతరత్రా వ్యాపారాలతో స్థిరపడినవారికి బీపీఎల్ కార్డు నుంచి తొలగించేలా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సుమారు 3లక్షల బీపీఎల్ కార్డులు రద్దయ్యాయి. ఎవరి కార్డు రద్దు అయ్యిందో తెలుసుకునేందుకు లబ్ధిదారులు రేషన్ షాపులతోపాటు పౌర ఆహార సరఫరాల కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. బీపీఎల్ కార్డుదారులకు పౌర ఆహార సరఫరాలశాఖ నిశ్శబ్దంగానే కోలుకోలేని దెబ్బకొట్టింది. బీపీఎల్ లబ్ధిదారుల సమీక్ష జరిపింది. పౌర ఆహార సరఫరాశాఖ నివేదికల ఆధారంగా కార్డులను రద్దు చేసింది. పౌర ఆహార సరఫరాల విభాగం ద్వారా అందిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 3.41 లక్షల కార్డులు రద్దు అయినట్టు సమాచారం. తద్వారా 40 లక్షల మంది లబ్ధిదారులు బీపీఎల్‌కు దూరం కానున్నారు. అనర్హులుగా భావించి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే రద్దు చేశారు. గడిచిన ఆరు నెలలుగా ఆహారశాఖ బీపీఎల్ కార్డుల సవరణల కసరత్తు కొనసాగించింది. ప్రతి నెలా సమాచారాన్ని సేకరించి అనర్హుల జాబితాను తయారు చేసింది. 3.41 లక్షల బీపీఎల్ కార్డులను రద్దు చేసి వాటిని ఏపీఎల్‌గా పరిగణించింది. కొందరి కార్డులు ఏపీఎల్ జాబితాలోకి మారిపోగా మరికొందరివి బీపీఎల్, ఏపీఎల్ రెండింటిలోనూ లేకుండా తొలగించినట్టు తెలుస్తోంది. గ్యారెంటీలను జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టారాజ్యంగా పెరిగిన బీపీఎల్ కార్డుల సంఖ్య తలనొప్పిగా మారింది. లక్షలాదిమంది అనర్హులు బీపీఎల్ కార్డులతో ప్రభుత్వ సౌలభ్యాలు పొందుతున్నారు. వీటితోపాటు అనారోగ్యం, వృద్ధాప్యంతో మృతి చెందిన మృతుల కార్డులను రద్దు చేశారు. ఇప్పటి వరకు 6.25 లక్షల మంది మృతుల పేరుతోనూ రేషన్‌కార్డుల చలామణిలో ఉన్నాయి. వీటిని రద్దు చేశారు. తద్వారా కొత్తగా బీపీఎల్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశం ఉంటుందని అధికారులు ప్రకటిస్తున్నారు. ప్రస్తుతానికి 2.95 లక్షలమంది బీపీఎల్ కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 1.27 కోట్ల బీపీఎల్ కార్డుల ద్వారా 4.36 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసమే వేచిచూస్తున్న పౌర, ఆహార శాఖ అధికారులు సీఎం సూచనలు అందినవెంటనే బీపీఎల కార్డులకు కోత విధించారు. అనర్హులను గుర్తించే విషయంలో పలు కీలకమైన సమాచారాన్ని అధికారులు సేకరించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించేవారు, ట్రాక్టర్, లారీలు కల్గినవారు, రెవెన్యూశాఖ ద్వారా భూముల వివరాలు సేకరించారు. మూడు హెక్టార్లకు పైగా మెట్ట భూమి, అందుకు అనుబంధంగా నీరావరి సాగు భూమి, ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగులను గుర్తించారు. రెవెన్యూశాఖ ద్వారా రిజిస్ట్రేషన్ వివరాలను, 1.20 లక్షల ఆదాయం కల్గినవారిని, సొంతస్థలాలు, అంతస్తుల భవనాలు ఉండేవారిని గుర్తించి తొలగించినట్టు సమాచారం. బీపీఎల్ కార్డుల సంఖ్య ఒక్కసారిగా తగ్గడంతో గ్యారెంటీల లబ్ధిదారులు తగ్గే అవకాశం ఉంది. రాష్ట్రంలో 80శాతం మంది బీపీఎల్ కార్డులు కల్గి ఉన్నారు.

ఇండియన్ హాత్ ఫెస్టివల్‌కు శ్రీకారం

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శన ఇండియన్ హాత్ ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు. సైరెటెడ్ క్రియేటర్ దీక్షా బర్న్‌వాల్ మేళాను ప్రారంభించారు. వందకుపైగా స్టాళ్లు ఉన్నాయని, దేశంలోని వివిధ రాష్ట్రాల కళాఖండాల ప్రదర్శన ఉంటుందన్నారు. వర్షాకాలనికి అనుగుణమైన జర్కిన్‌లు, చేనేతవస్త్రాలు ప్రత్యేకమని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 21వరకు మేళా ఉంటుందన్నారు.

అభివృద్ధికి నిధులు లేవు

- సీఎం వెంట ఉన్నందుకే నాకు గ్రాంట్లు ఇచ్చారు
- సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి



బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సిద్దరామయ్య ప్రభుత్వం గ్యారెంటీలను అమలు చేసేందుకు వివిధ గ్రాంట్లను సమకూర్చుకుంటోందని బీజేపీ నేతలు నిత్యం ఆరోపిస్తున్నారు. అందులో వాస్తవం లేదని సీఎం, డీసీఎంలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. సీఎం ఆర్థిక సలహాదారుడు, సీనియర్ ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి వీటిని అంగీకరించారు. ఆయన కొప్పళలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఎక్కువ గ్రాంట్లు గ్యారెంటీ పథకాలు మూసివేశాయన్నారు. పలు రంగాల అభివృద్ధికి నిధులు లేవన్నారు. ఏటా రూ.60 నుంచి 65వేల కోట్లు ఐదు గ్యారెంటీ పథకాలకు కేటాయించాల్సి వస్తోందన్నారు. తద్వారా అభివృద్ధి పనులకు ప్రభుత్వం వద్ద నిదులు లేవన్నారు. తనకు గ్రాంట్లు దక్కాయని, తాను సీఎం ఆర్థిక సలహాదారుడిగా ఉండడం, ప్రతిరోజూ సీఎంతో కలసి ఉండడం వల్ల మాత్రమే నియోజకవర్గ అభివృద్ధికి గ్రాంట్లు లభించాయన్నారు. శుక్రవారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక సంక్లిష్టత లేదన్నారు. తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, గ్యారెంటీ పథకాలను ఎక్కడా ఆపేది లేదన్నారు. గత ఏడాది బసవరాజ్ బొమ్మై సమర్పించిన బడ్జెట్ పరిశీలించాకనే గ్యారెంటీలను అమలు చేశామని అన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించామన్నారు. తాము ఓట్ల కోసం గ్యారెంటీలు తీసుకురాలేదని, ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

నటి అపర్ణ కన్నుమూత



బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ నటి, యాంకర్ అపర్ణ వస్తారె (57) కన్నుమూశారు. గత రెండేళ్లుగా కేన్సర్‌తో పోరాడిన అపర్ణ గురువారం రాత్రి తుదిశ్వాస వీడారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ ఆమె తుదిశ్వాస వీడినట్టు భర్త నాగరాజ్ వస్తారె వెల్లడించారు. శ్వాసకోశ కేన్సర్ నాల్గో స్టేజ్ చేరి ఇబ్బంది పడ్డారని ఆయన తెలిపారు. ఐదారు నెలలుగా తీవ్ర పోరాటమే చేశారని అన్నారు. 1984లో సినిమాల్లో ప్రవేశించిన అపర్ణ దూరదర్శన్‌కు అనుబంధమైన చందన చానల్‌లో పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పలు సీరియళ్లలోనూ నటించిన ఆమె 2013లో బిగ్‌బాస్ షోలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లోనూ ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించేవారు. అపర్ణ మృతి పట్ల ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కేంద్రమంత్రులు కుమారస్వామి, సోమణ్ణ, శోభాకరంద్లాజె, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సంతాపం తెలిపారు. పలువురు సినిమా నటులు, దర్శకులు, నిర్మాతలు నివాళులు అర్పించారు. బనశంకరిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నమ్మ మెట్రోకు అపర్ణ వాయిస్ ఓవర్‌ను నిరంతరంగా కొనసాగిస్తామని ఆమెకు ఇవే తమ నివాళులు అంటూ మెట్రో ప్రతినిధులు పేర్కొన్నారు.

టెక్ సమ్మిట్‌తో పెట్టుబడులు సాధిద్దాం

సీఈఓల భేటీలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెల్లడి


టెక్ సమ్మిట్ సన్నాహక సభలో సీఎం, డీసీఎం తదితరులు

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టెక్ సమ్మిట్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు సాధిద్దామని, పారిశ్రామికవేత్తలకు అన్ని సౌలభ్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బెంగళూరు టెక్ సమ్మిట్ సన్నాహక సభలో భాగంగా 200 మంది వివిధ కంపెనీల సీఈఓలు, మేనేజింగ్ డైరెక్టర్లతో శుక్రవారం ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, కియోనిక్స్ చైర్మన్ శరత్ బచ్చేగౌడ, రాష్ట్ర ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి ఎల్‌కే అతీక్‌తోపాటు ఐటీబీటీశాఖల ముఖ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో సాంకేతిక పరిశ్రమలు ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయని అన్నారు. ఆధునికత ప్రకటించడం ద్వారా పెట్టుబడులను ప్రోత్సహించడం, సుస్థిర అభివృద్ధికి కట్టుబడ్డామని తెలిపారు. 2022-23లో రాష్ట్ర జీడీపీ 14.2శాతంతో ప్రగతిదిశలో ఉందన్నారు. కర్ణాటక నాల్గో అతిపెద్ద రాష్ట్రంగాను, భారత జీడీపీలో 8.2శాతం వాటా ఉందని వివరించారు. ఇక్కడ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, ఎంఎన్‌సీలు సమానంగా స్వావలంబన సాధ్యమవుతున్నాయని అన్నారు. బెంగళూరు పారిశ్రామికవేత్తల వ్యవహారాలకు స్వర్గంగా ఉందన్నారు. స్టార్టప్, ఐటీ, బయోటెక్నాలజీ, ఏవియేషన్, ఈఎస్‌డీఎం సెక్టార్లలో నిర్దిష్టమైన పాలసీలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తును చూస్తుంటే సాంకేతిక ప్రగతి పరుగులు తీస్తున్నట్టు ఉందన్నారు. కృత్రిమ మేధస్సు, ఏఐఎంఎల్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చెయిన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో బెంగళూరు, కర్ణాటక ప్రగతిదిశలో ఉందన్నారు. నాస్కామ్, ఇండియా ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ, లీడ్ ఎంటర్‌ప్రైజెస్, టై విజన్ గ్రూప్‌ల సహకారంతోనే సాధ్యమవుతోందన్నారు. బెంగళూరు టెక్ సమ్మిట్ నవంబరు 19 నుంచి మూడు రోజులపాటు జరగనుందన్నారు. 31 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇవే విషయాలను ఐటీబీటీశాఖ మంత్రి ప్రియాంక ఖర్గే మీడియాకు వివరించారు.

చలో మైసూరును అడ్డుకున్న పోలీసులు

- ముడా అవినీతిపై ఆందోళనలు కొనసాగిస్తాం
- శాసనసభ సమావేశాల్లో ఎండగడతాం
- మండిపడ్డ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



బీదర్‌లో బీజేపీ ఆందోళన


బైఠాయించి నిరసన తెల్పుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఇళ్లస్థలాల కేటాయింపుల్లో అవినీతి వెనుక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉన్నారంటూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మైసూరును పోలీసులు అడ్డగించారు. శుక్రవారం రాజరాజేశ్వరినగర్ మీదుగా పెద్ద ఎత్తున నాయకులు కార్లలో మైసూరుకు బయల్దేరారు. సీఎం రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. కెంగేరి సమీపంలో పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులను అరెస్టు చేశారు. దీంతో బెంగళూరు - మైసూరు ఎక్స్‌ప్రెస్ హైవే కనమినకె టోల్‌ప్లాజా వద్ద కార్యకర్తలు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ ముడా అవినీతిపై బీజేపీ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నింటా విఫలం చెందుతోందని, దోచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముడా అవినీతి వేల కోట్లలో ఉందని, ఇందులో ప్రముఖుల భాగస్వామ్యం ఉందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేసేందుకు అవకాశం లేదనే రీతిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చలో మైసూరును అడ్డుకున్నంతమాత్రాన తమ పోరాటం ఆగదన్నారు. మరో మూడు రోజుల్లోనే శాసనసభ సమావేశాలు జరుగుతాయని, ఇదే అంశంపై సభలో నిరసన కొనసాగిస్తామని అన్నారు. కాగా, మైసూరులోని ముడా కార్యాలయానికి భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేపీ నిరసనకు పిలుపునివ్వడంతో ముడా కార్యాలయం చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. 10 కేఎస్ఆర్‌పీ ప్లటూన్‌లను కేటాయించారు. అంతకుముందు నిరసనలో ప్రతిపక్షనేత అశోక్, ఎమ్మెల్యేలు అశ్వత్థనారాయణ, మునిరత్న, మాజీ ఎమ్మెల్యే నందీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. విజయేంద్రతోపాటు బీజేపీ నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మైసూరు, మండ్య, రామనగర, కొడగు, చామరాజనగర జిల్లాలతోపాటు బెంగళూరులోనూ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేశారు. కొడగులో వర్షంలోనూ నిరసన కొనసాగించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

వైరముత్తు (పుట్టినరోజు)



తమిళసాహిత్యంలో రాణించి 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్న వైరముత్తు రామస్వామి 1953 జూలై 13న మధురై ప్రాంతంలో వైగై (ప్రస్తుతం థేని జిల్లా వడుగపట్టి)లో జన్మించారు. ఐదు దశాబ్దాలలో సినీ కెరీర్‌లో 7,500కుపైగా పాటలు రాశారు. ఏడు జాతీయ అవార్డులు, పద్మశ్రీ, పద్మ భూషణ్, సాహిత్య అకాడమీ అవార్డు వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. ఆయన రచించిన పద్యాలు, నవలలు తమిళం నుంచి ఇతర భాషలలోకి అను వాదమయ్యాయి. వక్తగా కూడా రాణించారు. ట్రస్టు ద్వారా పేద పిల్లల విద్యాభ్యాసానికి చేయూత ఇస్తున్నారు.

పావగడకు తరలి వచ్చిన తుంగభద్ర



తరలివచ్చిన తుంగభద్ర నీరు

పావగడ, జూలై 12 : తన చిరకాల కోరిక ఇప్పటికి నెరవేరిందని, ఈ రోజును ఎప్పటికీ మరిచిపోలేనని పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పావగడ తాలూకా పరిధిలోని కెంచమరహళ్లి గేటులో ఐపీఎస్3 ఫిల్టర్‌కు తుంగభద్ర తాగునీరు తరలి రావడంతో ఎమ్మెల్యే గంగపూజ చేసి ప్రారంభించారు. ఎంతో మంది రైతులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దళిత సంఘాలు నెలల కొద్ది నిరాహారదీక్షలు, పోరాటాల ఫలితంగా నేడు తుంగభద్రకు నీరు సాధ్యమయ్యిందన్నారు. 2013లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తుంగభద్ర తాగునీటి కోసం 250కి.మి. దూరం వరకు 1,116 గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందించాలన్న ఉద్దేశంతోనే కాల్వ పనులు చేపట్టారన్నారు. పది సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న తాగునీరు పావగడకు తరలి రావడంతో ఈ ప్రాంత ప్రజల ఆనందానికి హద్దు లేకుండా పోయిందన్నారు. నీటి తరలింపునకు సహకరించిన అధికారులకు, పనులకు కృషిచేసిన ఇంజనీర్లకు రుణపడి ఉంటామని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాగునీటి శాఖాధికారి హనుమంతరాయప్ప, జేఈ బసవలింగప్ప, కాంగ్రెస్ నాయకులు నాని, కౌన్సిలర్లు రవి, రాజేష్, రిజ్వాన్, షాబాబు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులపై కక్ష సాధింపులు మానుకోవాలి

మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్

గుంతకల్లు, జూలై 12: రైల్వే ఉద్యోగులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలను మానాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద మజ్దూర్ యూనియన్ రైల్వే ఉద్యోగుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలంటూ నినాదాలు చేశారు. డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాని నూతన పింఛను విధానాన్ని బలవంతంగా రుద్దారన్నారు. 8వ పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని, పాయింట్స్‌మెన్‌కు 4 గ్రేడ్స్ ఇవ్వాలని, పాయింట్స్‌మెన్‌తోపాటు ట్రాక్‌మెన్‌కు రూ. 4,200ల గ్రేడ్‌పే ఇవ్వాలని, ట్రైన్ పాసింగ్ డ్యూటీలు చేసేవారికి రిస్క్ అలవెన్సు, హార్డ్ డ్యూటీ అలవెన్సులను ఇవ్వాలని, ట్రాక్‌మెన్‌కు సైకిల్ అలవెన్సును ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఏదైనా ప్రశ్నకు సమాధానమిస్తే ఎదురు మాట్లాడుతున్నారంటూ రైల్వే ఉద్యోగులపై ఉన్నతాధికారులు కక్షగడుతున్నారని వెంటనే వేధింపులను మానాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీఎస్‌లు మధుసూదనరావు, నారాయణ, శేఖర్‌బాబు, అశ్విని, కార్యదర్శులు ఎస్‌ఎం బాషా, రమేశ్, సుధాకర్, రాజశేఖర్, మనోహర్, రవీంద్ర నాయక్, సురేష్ పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ ద్వారా అందించే వైద్యసేవలను షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఉపయోగించుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల వారు తీవ్రమైన అనారోగ్యాలు, కిడ్నీ, గుండె, కాలేయం, క్యాన్సర్, మెదడు, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సతోపాటు ఏదైనా ప్రాణాంతక వ్యాధితో బాధపడుతుంటే ఈ పథకం ద్వారా వైద్య సహాయం అందిస్తారన్నారు. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ కమ్యూనిటీకి చెందిన వారు అర్హులన్నారు. శస్త్రచికిత్సకు కనీసం 15 రోజుల ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ డైరెక్టర్, న్యూఢిల్లీకి వివరాలు పంపాలన్నారు. చికిత్స అంచనా వ్యయంలో 100 శాతం నేరుగా సంబంధిత ఆస్పత్రికి నెఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా సీలింగ్ పరిమితితో విడుదల చేస్తారన్నారు. గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో ఈ వైద్య చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు ౖఞ్చఛీజ్టఞజౌ్ఞఛ్టీజీౌ్ఞ.జీఛి.జీ వెబ్‌సైట్ లేదా అనంతపురంలోని ఎస్సీ సంక్షేమశాఖ, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, ఉరవకొండలోని సాంఘిక సంక్షేమ అధికారులను సంప్రదించాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, జూలై 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్య దర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 944 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.48

అనంతపురంరూరల్, జూలై 12: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 83 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.42, కనిష్ఠ ధర రూ.33 పలికినట్లు ఆయన తెలిపారు.

జనస్పందనలో 120 అర్జీలు

నెలలోగా పరిష్కారం : బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, జూలై 12: తాలూకాలో వెనుకబడిన గూళూరు హోబళి గూర్తపల్లి గ్రామ పంచాయతీలో రెవెన్యూశాఖ, తాలూకా పంచాయతీ శుక్రవారం నిర్వహించిన జనస్పందనలో 120 అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి స్వయంగా పాల్గొని ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఇదే సందర్భంగా వివిధశాఖల లబ్ధిదారులకు బాండ్లు, చెక్కులు అందచేశారు. అనంతరం మాట్లాడుతూ నెలలోగా అర్జీలను పరిష్కరిస్తామన్నారు. అధికారులే గ్రామానికి వచ్చి ప్రజల సమస్యలను ఆలకించి పరిష్కరించడమే జనస్పందన కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. కాగా భూముల రికార్డులలో నాన్న, తాత, ముత్తాల పేర్లు ఉంటే ప్రయోజనం లేదని వారసుదారులు మీ పేర్లతో మార్చుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. గ్రామానికి అదనపు బస్సు సర్వీసులు నడపాలన్న ప్రజల వినతిపై సానుకూలంగా స్పందిస్తూ సోమవారం నుంచి కేఎస్‌ఆర్టీసీ బస్సులు అదనంగా నడిపేలా అధికారులకు సూచించినట్టు తెలిపారు. కాగా డెంగీ జ్వరం ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తమ చుట్టుపక్కల ప్రదేశాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని, డ్రైనేజీలలో పూడిక తీయాలన్నారు. కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం ప్రస్తుతానికి అవకాశం కల్పించలేదని అయితే పేర్లు, చిరునామాలలో సవరణలు ఉంటే చేసుకోవచ్చునన్నారు. సర్వర్ సమస్య కూడా ఉందని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. భాగ్యలక్ష్మి, గృహలక్ష్మి, ఆరోగ్యరక్షా కవచ గుర్తింపుకార్డులను అర్హులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రి, తాలూకా పంచాయతీ ఈఓ రమేశ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి, జిల్లా ఆరోగ్య కుటుంబ సేవల జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ మహేశ్‌కుమార్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ సీఎన్ సత్యనారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ పీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూయార్క్ మౌంట్ సినైతో రామయ్య మెమోరియల్ ఆసుపత్రి ఒప్పందం



ఒప్పందంలో ఇరు సంస్థల ముఖ్యులు, మంత్రులు తదితరులు

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ మల్టిసూపర్ స్పెషాలిటీ క్వార్టినరీ కేర్ ఆసుపత్రులలో ఒక టిగా గుర్తింపు పొందిన రామయ్య మెమోరియల్ హాస్పిటల్, న్యూయార్క్‌కు చెందిన మౌంట్ సినై ఆసు పత్రితో కీలక ఒప్పందం చేసుకుంది. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం, సినై ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ జుబీ డోరోటోవిక్స్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కేంద్ర పౌర, ఆహార సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూ రావు తదితరులు పాల్గొన్నారు. రెండు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో అంకాలజీ, కార్డియాలజీ, న్యూరో సైన్సెస్‌తో పాటు అన్ని విధాలా ఆధునాతన వైద్య సేవలకు అనుసంధానం ఉంటుందన్నారు. డాక్టర్ ఎంఆర్ జయరాం మాట్లాడుతూ మౌంట్ సినైతో ఒప్పందం చేసు కోవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో వైద్య రం గంలో మరిన్ని ఆవిష్కరణలు సాంకేతికతతో కలసి నడు స్తామని ఆరోగ్యరంగంలో గుణాత్మకతను తీసుకొచ్చేం దుకు మార్గదర్శకం కానుందన్నారు. డాక్టర్ జుబీ డోరోటోవిక్స్ మా ట్లాడుతూ బెంగళూరు నిర్మాత కెంపేగౌడ స్ఫూర్తి బెంగ ళూరు ప్రజల అభివృద్ధికి కారణమన్నారు. మా ఒప్పం దం దీర్ఘకాలం ఉంటుందని బెంగళూరు కర్ణాటక ప్రజలకు అత్యు న్నత అంతర్జాతీయ వైద్య సేవలు కల్పించేందుకు శ్రమిస్తా మన్నారు. మౌంట్ సినై ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ డేవిడ్ ఎల్ రీచ్ మాట్లాడుతూ రెండు ఆసుపత్రుల ఒప్పం దం, సహభాగత్వానికి వైద్య విద్య ఆవిష్కరణలకు పరస్పర సహకారం ఉంటుందన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎంఆర్ శ్రీనివాసమూర్తి, రామయ్య మెమో రియల్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ఎస్‌సీ నాగేంద్ర స్వామిలు భాగస్వామ్యులయ్యారు.

ఈఎస్‌ఐ ఆసుపత్రిని ప్రారంభించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

దొడ్డబళ్ళాపుర, జూలై 12: తాలూకాలోని బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడలో నిర్మాణాలు పూర్తయి కార్మికుల సేవలకు సిద్ధంగా ఉన్న ఇఎస్‌ఐ ఆసుపత్రిని ప్రారంభించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ సంచాలకులు పీఏ వెంకటేశ్, అంగన్‌వాడీల సంఘం ఎల్‌ఆర్ నళినాక్షి, కార్మిక నాయకులు రేణుక ఆరాధ్య, అనిల్‌గుప్త, ఇనాయత్‌పాష తదితరులు పాల్గొన్నారు. గతంలో సిద్దరామయ్య సీఎంగా ఉన్న హయాంలో శంకుస్థాపన చేశారని, నిర్మాణాలు ముగిసి ఏడాదిన్నర అయినా రాజకీయ ఉద్దేశ్యాలతో ప్రారంభానికి నోచు కోలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. వంద పడకల సామర్థ్యం కల్గిన ఇఎస్‌ఐ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి సిద్ధంగా ఉన్నప్పటికీ కార్మికులకు అందుబాటులోకి రాలేదన్నారు. ఇప్పటికే పలు మార్లు నిరసనలు చేసినా స్పందన కరువైందని ఇకనైనా అధికారులు స్పందించి ప్రారం భించేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీసవేతనం రూ.31వేలు అమలు చేయాలన్నారు. ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. నిరసనలో వివిధ కార్మికల సంఘాల ప్రముఖులు బీ నరేశ్‌కుమార్, సాదిక్‌పాషా, మునేగౌడ, సుమా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న వీసీకే నాయకులు

దొమ్మసంద్ర, జూలై 12: బహుజన సమాజ్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సి. హళ్ళి వేణు డిమాండ్ చేశారు. ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర కూడలిలో ఆనేకల్ తాలూకా వీసీకే పార్టీ ఆధ్వర్యంలో ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులో దళిత సముదాయం అత్యధికంగా ఉందని అయినా కూడా పేద, మధ్య తరగతి ప్రజలకోసం పాటుపడిన నాయకుడిని హతమార్చడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ కేసులో తమిళనాడు గవర్నర్ జోక్యం చేసుకుని సీబీఐకు అప్పగించాలని డిమాండ్ చేశారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌వీ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో దళితులకు రానురాను రక్షణ కరువైందన్నారు. సాహితీవేత్తలు, సామాజిక పోరాట నేతలపై దాడులు చోటు చేసుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు మౌనంగా ఉండడం అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్జాపుర సర్కిల్‌లో మానవహారంగా నిరసన తెల్పుతూ నిందితులకు ఉరిశిక్ష వేయాలంటూ నినాదాలు చేశారు. నిరసనలో వీసీకే పార్టీకి చెందిన వర్తూరు జె కృష్ణప్ప, రాజ్‌కుమార్, రాజణ్ణ, ప్రకాశ్, కోలారు జిల్లాధ్యక్షుడు భరత్‌కుమార్, ఆనేకల్ తాలూకా అధ్యక్షుడు గోపసంద్ర వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెండితెరకు ఐదుగురు జూనియర్ల పరిచయం



ఎంపికైన ఐదుగురు వీరే..

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'మహానటి' పేరిట ప్రదర్శితమవుతున్న షో ద్వారా రాణించిన ఐదుగురు జూనియర్లను వెండితెరకు పరిచయం చేసేందుకు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా రమేశ్ అరవింద్, ప్రేమ, తరుణ్ సుధీర్, నిశ్వికా నాయుడు వ్యవహరించారు. చిత్రదుర్గ గగన, కారవార శ్వేతాభట్, మూడబిదరె ఆరాధనాభట్, తరికెరె ధనశ్రీలు లఘుచిత్రాల ద్వారా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వీటికి ప్రముఖ దర్శకులు శశాంక్, జయతీర్థ, మన్సూర్, అలెమరె సంతు, పన్నాగభరణలు రూపొందించారు. మహానటి ద్వారా కన్నడ ప్రేక్షకులను రంజింపచేసిన ఐదుగురిని వెండితెరకు పరిచయం చేయడం సంతోషంగా ఉందని నటుడు, దర్శకుడు రమేశ్ అరవింద్ అభిప్రాయపడ్డారు. ఉత్తరహళ్ళిలోని శ్రీనివాస టాకీస్‌లో ఇందుకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం జరిగింది.

గ్రామదేవతలకు విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

శిడ్లఘట్ట, జూలై 12: తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు విశేషపూజలు సమర్పించిన అనంతరం దిబ్బూరు పంచాయతీ పరిధిలోని గోళ చిన్నప్పనహళ్ళిలోని పంచమాతలకు పూజలు చేసేందుకు తరలారు. దేవరమళ్ళూరు గ్రామంలోని గ్రామదేవత మళ్ళూరమ్మ, కట్టపై గంగమ్మ, ఆంజనేయస్వామికి పూజలు చేసిన అనంతరం సంప్రదాయబద్ధంగా ప్రతి ఇంటి నుంచి కనీసం ఒకరు ట్రాక్టర్‌లో పూజ సామగ్రితో వెళ్లారు. దారిలో ద్యావప్పనగుడిలో పూజల అనంతరం గూళ్ళచిన్నప్పనహళ్ళిలోని సప్తమాతృకలైన దొడ్డమ్మ, నరడమ్మ, గౌత్లమ్మ, సపలమ్మ, గంగమ్మ, ప్లేగమ్మలకు పూజలు చేశారు. సప్పలమ్మ దేవతలకు ఆరుద్ర కార్తెలో వచ్చే వర్షాల వేళ పూర్వీకులు గ్రామదేవతలకు పూజలు చేసి వడిబియ్యం సమర్పించేవారని తద్వారా గ్రామానికి, పశుపక్ష్యాదులకు మేలు జరుగుతుందన్న నమ్మకం ఉందని గ్రామపెద్ద బచ్చప్ప తెలిపారు.

గ్రామీణ విద్యార్థులకు చేయూత ఇవ్వండి



పుస్తకాలతో విద్యార్థులు, నిర్వాహకులు

బంగారపేట, జూలై 12: అనేక గ్రామాలలోని పిల్లలు సరైన సదుపాయాలు లేక విద్యకు దూరమవుతున్నారని అటువంటి వారిని గుర్తించి వారి విద్యకు చేయూత ఇవ్వాలని దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సరస్వతి విద్యానికేతన్ కన్నడ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు సంఘం తరపున నోటు పుస్తకాలను అంద చేసి మాట్లాడారు. సమాజంలో ఎంతోమంది చదువుకోసం ఆరాపటడే వారు ఉన్నారని అయితే ఇంట్లో తగిన వాతావరణం, సౌకర్యాల కొరతతో దూరమవు తున్నారన్నారు. ఆసక్తి, ప్రతిభావంత విద్యార్థులకు చేయూతనిచ్చి ప్రోత్సహిం చాలన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు, అభివృద్ధి సాధ్యమన్నారు. తమ వంతుగా పిల్లలకు నోటు పుస్తకాలు, లేఖనాసామగ్రి అందజేశామన్నారు. శ్రీమంతులు, దాతలు కూడా పిల్లల విద్యకు తమ వంతు సహకారం అందించా లని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ అశ్వత్, మంజునాథ్, సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబరీశ, జిల్లాధ్యక్షుడు గౌతమ్, కార్యదర్శి అర్జున్, తాలూకా అధ్యక్షుడు నాగేశ్, గోవింద, జాని తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి గాయాలు

నార్పల, జూలై 12: మండలంలోని గూగూడు గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అతిగా మద్యం సేవించి శుక్రవారం డబ్బు విషయమై ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. గోరంట్లకు చెందిన లక్ష్మీకాంత్, నాగరాజు అనే ఇద్దరు స్నేహితులు గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చారు. స్వామి దర్శనం అనంతరం బ్రాందిషాపులో అతిగా మద్యం సేవించి డబ్బు విషయమై ఒకరికొకరు దుర్భషలాడుకున్నారు. కోపోద్రిక్తుడైన లక్ష్మీకాంత్ తన చేతిలో ఉన్న బీర్ సీసాతో నాగరాజు తలపై విచక్షణా రహితంగా కొట్టాడు. ఘర్షణలో నాగరాజు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆయనను 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రైతులకు అవగాహన

అగళి, జూలై 12 : వ్యవసాయ పనిముట్ల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఇనగలూరు, మధుడి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఏఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టం షేరింగ్ సెంటర్‌ను పరిశీలించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ దాక్షాయిని, రైతులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కుమారతో మంత్రి సతీశ్‌జార్కిహోళి భేటీ

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ప్రకటనలు చేసే నేతగా పేరొంది సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడిగా ముద్రపడిన రాష్ట్ర ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి, కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామిని ఢిల్లీలో గురువారం భేటీ అయ్యారు. ఇటీవల కొన్ని రోజులుగా సీఎం, డీసీఎంల మధ్య నాయకత్వ మార్పు, అదనపు డీసీఎంల ప్రస్తావన వచ్చింది. అధిష్ఠానం హెచ్చరికలతో అంతలోనే సమసింది. సీఎం, డీసీఎంలకు రాజకీయాల్లో బద్ధ శత్రువు అనే మారిపోయిన కేంద్రమంత్రి కుమారస్వామితో రాష్ట్ర మంత్రి సతీశ్ జార్కిహోళి భేటీ కావడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. అధికారులతో వెళ్లిన సతీశ్‌జార్కిహోళి వారిని బయటే ఉంచి కాసేపు కుమారస్వామితో చర్చలు జరిపారు. వీరిద్దరి మధ్య ఏ అంశంపై చర్చ జరిగింది, ప్రత్యేకించి ఏ నాయకుడి ప్రస్తావనలు వచ్చాయనేది కుతూహలం అవుతోంది.

అస్సాం ఎంపీతో అభిషేక్ భేటీ



ఎంపీ గౌరవ్ గొగోయ్‌తో అభిషేక్

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రం లోక్‌సభ సభ్యుడు గౌరవ్ గొగోయ్‌తో కాంగ్రెస్ యువ నాయకుడు అభిషేక్ భేటీ అయ్యారు. గౌరవ్ గొగోయ్ బెంగళూరుకు వచ్చిన సందర్భంగా గురువారం కలిశారు. గతంలో గౌరవ్ గొగోయ్ తండ్రి తరుణ్ గొగోయ్ అస్సాం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర మాజీ మంత్రి రఘుపతి కుటుంబంతో సంబంధాలు ఉండేవి.

ఉపవిభాగాధికారిగా దుర్గశ్రీ



దుర్గశ్రీ

దొడ్డబళ్ళాపుర, జూలై 12: దొడ్డబళ్ళాపుర ఉప విభాగాధికారిగా దావణ గెరెలో పని చేస్తున్న కేపీఎస్‌సీ టాపర్ దుర్గశ్రీ ఎస్ బదిలీ అయ్యారు. ఇక్కడ ఉప విభాగాధికారిగా వ్యవ హరిస్తున్న ఎం శ్రీనివాస్‌ను రాష్ట్ర పౌర ఆహార సరఫరాల మండలిలో ఖాళీగా ఉన్న ఉపప్రధాన వ్యవస్థాపక పోస్టుకు మార్పు చేశారు. 2019లో కేపీఎస్‌సీలో 31వ ర్యాంకులో నిలిచిన దుర్గశ్రీ దావణగెరె ఉప విభాగా ధికారిగా జాయిన్ అయ్యారు. ప్రస్తుత బదిలీపై ప్రభుత్వ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఉమాదేవి ఆదేశాలు విడుదల చేశారు.

సీనియర్ తెలుగు పాత్రికేయుడు సత్యనారాయణశాస్త్రి కన్నుమూత




సత్యనారాయణశాస్త్రి (ఫైల్)

బెంగళూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీనియర్ తెలుగు పాత్రికేయుడు సత్య నారాయణ శాస్త్రి (76) కన్నుమూశారు. మూడు న్నర దశాబ్దాలకుపైగా బెంగళూరులో వివిధ పత్రికల్లో విలేకరిగా పని చేశారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతుండేవారు. శుక్రవారం ఉదయం ఆయన మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సత్య నారాయణశాస్త్రి మృతి పట్ల తెలుగు పత్రికల పాత్రికేయులతోపాటు బెంగళూరు ప్రెస్ క్లబ్ తరఫున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మధ్యాహ్నం తర్వాత సత్యనారాయణ శాస్త్రి అంత్యక్రియలు పీణ్యాలో నిర్వ హించినట్టు కుటుంబీకులు తెలిపారు.

సమష్టిగా పనిచేద్దాం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12: ఇంజనీర్లు, ఉద్యోగులందరూ కలసికట్టుగా పనిచేసి జిల్లాను సస్యశ్యామలం చేద్దామని జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్ పిలుపునిచ్చారు. జలవనరుల శాఖ సీఈగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజను శుక్రవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని ఆ శాఖ కార్యాలయంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకు సమష్టి కృషి, ప్రణాళికతో ముందుకు వెళ్దామని అన్నారు. జిల్లాకు వీలైనంత ఎక్కువ నీటిని శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలవ ద్వారా తీసుకు వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. హంద్రీనీవా డిప్యూటీ ఎస్ఈ రాంభూపాల్‌రెడ్డి, ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.28	1,584.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,643	17,383
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	205	266
సామర్థ్యం (టీఎంసీలు)	29.16	6.89

వైభవంగా స్కందషష్ఠి పూజలు



ప్రత్యేకాలంకరణలో సండూరు కుమారస్వామి

బళ్లారిరూరల్, జూలై 12 : బళ్లారి నగరంలోని ఫైర్ ఆఫీసు సమీపంలోవున్న కుమారస్వామి ఆలయంలో శుక్రవారం స్కందషష్ఠి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. ఈపూజల్లో నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా సండూరులో వెలసిన కుమారస్వామి ఆలయంలో స్వామివారికి స్కంధషష్ఠిపూజలను విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు కూడా అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



డీసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ

బళ్లారి సిటీ, జూలై 12: విద్యార్థుల సమస్యలపై స్పందించి రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర జయింట్ సెక్రెటరీ వినోద్ రాంపూర్ అన్నారు. నగరంలో శుక్రవారం చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సరైన సమయంలో బస్సు పాసలను అందజేయాలన్నారు. స్త్రీశక్తి యోజన వల్ల ఎక్కువ మంది మహిళా విద్యార్థులకు పాసులు జారీ చేయని కారణంగా వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈసందర్భంగా సురేశ్ బడిగెర మాట్లాడుతూ, పేద, ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు ఉపకార వేతనాలు అందించడం ప్రభుత్వాల కర్తవ్యమని, గత సంవత్సరం విద్యార్థులకు సక్రమంగా అవి జమకాలేదన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా హాస్టళ్లకు దరఖాస్తులు తీసుకోలేదన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్ళ సౌకర్యాలు కల్పించాలని ఏబీవీపీ కోరుతుందన్నారు.

పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన తర్వాత, హాస్టల్ ఎంపికలో ఆలస్యం చేయకుండా విద్యార్థులకు ప్రవేశం కల్పించాలన్నారు. విద్యార్థులకు పాఠశాల వేళలో బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అవినీతి లేని సేవలు అందించేదే పోస్టల్ శాఖ



సమావేశంలో పోస్టల్ హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథశెట్టి

సిరుగుప్ప, జూలై 12 : అవినీతి లేకుండా సేవలు అందించే శాఖలలో పోస్టల్‌శాఖ ముందుంటుందని హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథశెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో పోస్టల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథ శెట్టి మాట్లాడుతూ రైల్వే బుకింగ్, ఆధార్ కార్డులో తప్పుఒప్పులు సరి చేయడం, పించన్ల పంపిణీ, సమృద్ధి సుకన్య పథకం ఖాతాల ప్రారంభం తదితర ఎన్నెన్నో సేవలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. ప్రధానంగా ప్రతి ఇంటికి తిరిగే ఉద్యోగి పోస్టల్ ఉద్యోగేనని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణాల్లో ఎలుగుబంట్లు కలకలం

- కూడ్లిగి కళాశాల మైదానంలో ఎలుగుబంటి వాకింగ్
- హొసపేటలో ఎలుగును బంధించిన అటవీ సిబ్బంది

బళ్లారి జిల్లాలో వన్యమృగాలు వీరవిహారం చేస్తున్నాయి. యథేచ్ఛగా జనావాసాల్లోకి చొచ్చుకొస్తున్నాయి. అడవుల్లో ఉండాల్సిన జంతువులు పట్టణాల్లోకి ఎందుకు వస్తున్నాయో అంతుబట్టని విషయంగా మారింది. ఆహారం దొరకక జనావాసాల్లోకి వచ్చిన వాటిని చూసి జనం మాత్రం భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా శుక్రవారం కూడ్లిగిపట్టణంలోకి ఓ ఎలుగుబంటి వాకింగ్‌కు రాగా, హొసపేట పట్టణంలోని పార్కులోకి మరో తల్లీ,పిల్ల విహారానికి వచ్చాయి.

బళ్లారి సిటీ, జూలై 12: కూడ్లిగి పట్టణంలో రెండ్రోజుల క్రితం ఎలుగుబంటి కనిపించిన విషయం మరవకముందే మళ్లీ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం తెల్లవారుజామున మరో ఎలుగుబంటి కనిపించింది. శుక్రవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో కళాశాల మైదానంలోకి జాగింగ్ కోసం సమర్థ్ అనే యువకుడు వెళ్లగా, బాస్కెట్ బాల్ కోర్టునుంచి ఒంటరిగా ఎలుగుబంటి నడుచుకుంటూ రావడం కంటబడింది. దీంతో భయాందోళనకు గురైన అతడు కొద్దిదూరంలో నిలబడి ఎలుగుబంటి పరుగు తీసిన దృశ్యాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇది చాలా వైరల్‌గా మారింది. పట్టణ శివార్లలోని అమరదేవగరగుడ్డ, గుండినహొళె రహదారిలో వాహనాల్లో వెళ్ళేవారు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖాధికారులు తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఫారెస్ట్ అధికారి మాట్లాడుతూ, ఎలుగుబంట్లు, చిరుతపులులు ఆహారం వెతుక్కుంటూ గ్రామాలలోకి వస్తున్నాయని, అయితే ఈరెండు జంతువులు మనుష్యులపై ఒక్కసారిగా దాడి చేయవని, ప్రజలు కేకలు వేస్తే ప్రాణభయంతో దాడి చేస్తున్నాయన్నారు.



కూడ్లిగి పట్టణ మైదానంలో వాకింగ్ చేస్తున్న ఎలుగుబంటి

హొసపేటలో ఎలుగుబంటిని పట్టుకున్న అటవీ సిబ్బంది

హొసపేట నగరం నడిబొడ్డున శ్రీరాములు పార్కులో శుక్రవారం తెల్లవారుజామున రెండు ఎలుగుబంట్లు సంచరిస్తున్న దృశ్యాన్ని ఓ మహిళ తన ఫోన్‌లో బంధించి సోషల్‌మీడియాలో షేర్ చేశారు. పొద్దెక్కిన తర్వాత వీటిలో ఒక ఎలుగుబంటి శ్రీరాములు పార్కులో సంచరిస్తుండగా జనం గుమిగూడడంతో అది ఉద్యానవనంలోని పొదలోకి వెళ్లి దాక్కుంది. వాటిని పట్టుకోవడానికి కమలాపురం నుంచి బోనులు, మత్తుఇంజక్షన్ గన్‌లతో వచ్చిన సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి ఆ ఎలుగుబంటిని పట్టుకున్నారు. పిల్ల ఎలుగుబంటి ఆచూకీ మాత్రం దొరకలేదు. దానికోసం గాలిస్తున్నారు.



హొసపేటలో వలతో ఎలుగుబంటిని పట్టుకుంటున్న అటవీశాఖ సిబ్బంది

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి



ఎస్పీ శోభారాణిని సన్మానిస్తున్నశివన్నారాయణ

సిరుగుప్ప, జూలై 12: పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషిచేస్తానని జిల్లా ఎస్పీ శోభారాణి తెలిపారు. బళ్లారి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శోభారాణి సిరుగుప్ప నియోజకవర్గంలో టెక్కలకోట, సిరుగుప్ప పట్టణాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల పనితీరును, రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా క్రైమ్ రేటు తగ్గించే పనిలో పోలీసులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. సిరుగుప్ప నియోజకవర్గంలో అన్ని స్టేషన్‌లో పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. జేడీఎస్ తాలుకా అధ్యక్షులు శివన్నారాయణ పూలమాలతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేష్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ తిమ్మన్న నాయక్, పోలీసులు పాల్గొన్నారు.

కంప్లి జేడీఎస్ అధ్యక్షుడిగా ఇర్ఫాన్

కంప్లి, జూలై 12: కంప్లి నగర జేడీఎస్ అధ్యక్షులుగా ఇర్ఫాన్ గుత్తి నియమితులయ్యారు. ఆయన గతంలో జేడీఎస్ పార్టీ గెలుపుకు కృషి చేయడంతో జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యాధ్యక్షులు ఆర్య, అధ్యక్షులు రాజునాయక్, జిల్లా అధ్యక్షులు మీనళ్లి తాయణ్ణలు అతడిని నగర అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్‌గుత్తి విలేకరులతో మాట్లాడుతూ జేడీఎస్ పార్టీ నాయకులు తనను గుర్తించి ఈ బాధ్యత ఇచ్చారన్నారు. ముున్ముందు తాను జేడీఎస్ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.



ఇర్ఫాన్ గుత్తి

పొగాకు దుష్పరిణామాలపై అవగాహనకు కృషి

- అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా

బళ్లారి సిటీ, జూలై12: పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా అన్నారు. నగరంలోని నూతన జిల్లా పాలనా భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాపొగాకు నియంత్రణ సెల్ ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దుకాణాలు, హోటళ్ళు, బేకరీలు, లాడ్జీలు, బార్ అండ్ రెస్టారెంట్లు ఇతర వాణిజ్య దుకాణాల్లో తప్పనిసరిగా నేమ్‌ప్లేట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నామఫలకాలు పెట్టని దుకాణాలకు నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లాలోని 75ప్రీ-డిగ్రీ కళాశాలల్లో, 62కళాశాలల్లో సెక్షన్-4,సెక్షన్-6బీ నేమ్‌ప్లేట్‌లను ఏర్పాటు చేశామని, మిగిలిన కళాశాలల్లో వెంటనే నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీడీపీని ఆదేశించారు. జిల్లాలో 2093 లైసెన్స్ దుకాణాలు, బేకరీలు, హోటళ్ళు ఉన్నాయని వాటిలో నామఫలకాలు ఏర్పాటు చేశామని, మిగిలిన 686చోట్ల నామఫలకాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్నిగ్రామాల్లో పొగాకు నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. అందుకు అనుగుణంగా ఆపరేషన్లు నిర్వహించి జరిమానాలు వసూలు చేయాలని సూచించారు. జిల్లాపరిధిలోని బస్టాపుల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం ఎక్కువగా కనిపిస్తోందని వీటిని అరికట్టాలని కేకేఆర్‌టీసీ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. కోట్పా చట్టానికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్, రమేశ్‌బాబు, జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి, జిల్లా సర్వే అధికారి డాక్టర్ మరియంబి, జిల్లా క్షయ నిర్మూలన అధికారిణి ఇంద్రాణి, ఈశ్వరప్ప దాసప్పనవర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా

సింగటలూరు బ్యారేజీ సామర్థ్యం పెంపు యోచన



బ్యారేజీ నుంచి వృథాగా వెళుతున్న నీరు

కంప్లి, జూలై 12 : విజయనగర జిల్లాలోని సింగటలూరు బ్యారేజీ సామర్థ్యం పెంపుపై ఎట్టకేలకు అధికారులు దృష్టి సారించారు. ప్రతి ఏడాది బ్యారేజీ నుంచి గదగ్, హావిన అడగళ్లి, ముండరిగి పట్టణాలకు తాగేందుకు నీరు మళ్లిస్తున్నారు. కానీ వర్షాకాలంలో మాత్రం బ్యారేజీ సామర్థ్యం తక్కువగా వుండటంతో నీరు వృధాగా పోతోంది. ఈ సామర్థ్యాన్ని పెంచేందుకు త్వరలోనే చిన్ననీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అలా చేస్తే సింగటలూరు చుట్టుపక్కల గ్రామాలకు, పట్టణాలకు నీటి సమస్య తలెత్తకుండా వుంటుందని ప్రజలు తెలిపారు.

ఇష్టంతో చదివితే సాధించలేనిది లేదు



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూలై 12 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఎంత పెద్ద చదువులైనా ఫలితాలు ఇస్తాయని కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. సన్నాపురం రోడ్డులోని రెయిన్‌బో కళాశాలలో నూతనంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆయన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎంతో మంది కంప్లి తాలుకా గ్రామాల్లోని విద్యార్థులు కొడగు, బళ్లారి, హోస్పేట పట్టణాలకు చదువుల కోసం వెళుతున్నారని, దీన్ని దృష్టిలోవుంచుకుని రెయిన్‌బో సంస్థ వ్యవస్థాపకులు చాంద్ బాషా పేద ప్రజలకు అనుకూలంగా ఈ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. కళాశాలలో విద్యార్థులను చేర్పి విద్యాభ్యాసం చేయాలని కోరారు. అనంతరం వ్యవస్థాపకులు చాంద్ బాషా మాట్లాడుతూ పొరుగు పట్టణాల మాదిరిగానే విద్యాభ్యాసం చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ఉపన్యాసకులను సిద్ధం చేశామన్నారు. ఉత్తమ విద్య కల్పించి తమ విద్యాసంస్థల ద్వారా గుర్తింపు పొందుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఫరూక్, డాక్టర్ క్రిష్ణ కుమార్, శ్రీనివాస రావు, సీఐ వాసుకుమార్, పురసభ మాజీ అధ్యక్షులు సుధీర్, నారాయణప్ప, షణ్ముఖ, సుధాకర్, సత్యప్ప, జాఫర్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకగా మారిన దూరదర్శన్ కేంద్రం

బళ్లారి గాంధీనగర్, జూలై 12: వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ అంటేనే పేద, బడుగు వర్గాల జీవనోపాధి కల్పించేదని చెప్పుకోవచ్చు. పెద్ద పెద్ద వ్యాపారస్తులు మొదలుకుని చిన్నపాటి వ్యాపారులు సైతం మార్కెట్‌పై ఆధారపడి ప్రత్యక్ష, పరోక్షంగా జీవనకం సాగిస్తుంటారు. ఇక కూలీ కార్మికులు ఎద్దుల బండ్ల కార్మికులు ఒకచోట నుండి మరోచోటుకు సరుకు రవాణా చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంటారు. ఆటోలు, లగేజి వాహనాలు లేని రోజుల్లో ఏపీఎంసిలో ఎక్కువగా ఒంటెద్దు బండ్లపై వ్యాపారస్తులు ఆధారపడాల్సి వస్తుండడంతో మార్కెట్‌లో ఎద్దుల విశ్రాంతి కోసం విశాలమైన స్థలంలో రేకులు షెడ్డు ఏర్పాటు చేశారు. రానురాను సరుకు రవాణాను లగేజి ఆటోలు ఆక్రమించుకోవడంతో మార్కెట్‌లో ఒంటెద్దు బండ్ల ప్రాముఖ్యత తగ్గిపోయింది. మార్కెట్ పాలక మండలి కూడా ఒట్టెద్దుబండ్ల కార్మికుల అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. దీంతో మార్కెట్‌కు వచ్చిన ఒంటెద్దు బండ్ల కార్మికులు మార్కెట్ ప్రాంగణంలో ఉన్న పాత పరిపాలనా భవనాన్ని పశువుల పాకగా మార్చుకున్నారు. దీనికితోడు దూరదర్శన్ ప్రసారాలు డిజిటలైజ్ కావడంతో ఏపీఎంసి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన దూరదర్శన్ కేంద్రం సేవలు నిలిచి పోయాయి. దీంతో ఒంటెద్దు వ్యాపారులు ఈ రెండు భవనాలను పశువుల పాకలుగా మార్చుకున్నారు. అసలే మార్కెట్ వ్యాపారస్తులు భవనాల కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో ఇలాంటి భవనాలను పశువుల పాకలుగా మార్చడం పట్ల స్థానిక వ్యాపారస్తులు పాలనా మండలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాలు వ్యాపారస్తులకు అప్పగిస్తే ఉపయోగపడతాయని.... ఇలా పశువుల పాకగా మారిస్తే ఎలా అంటూ... పాలక మండలిని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పాలకమండలి దృష్టి సారించి వృథాగా ఉన్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానిక వ్యాపారస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఒకనాటి దూరదర్శన్ కేంద్రం... నేడు పశువుల పాక

పౌరకార్మికుల భవనం సిద్ధం



సంతోషం వ్యక్తపరుస్తున్న పౌర కార్మికులు

కంప్లి, జూలై 12 : కుడితిని పట్టణంలో గత కొన్నేళ్లుగా పౌర కార్మికులకు విశ్రాంతి గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎట్టకేలకు ముఖ్య అధికారి తీర్థ ప్రసాద్, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు పౌర కార్మికుల సమస్యను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి కుడితిని పట్టణంలో ప్రభుత్వాస్పత్రి పక్కన భవనాన్ని ఏర్పాటు చేశారు. ఈ భవనాన్ని ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఇకపై పౌర కార్మికులకు ఉదయాన్నే టిఫెన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే పనులు చేసేటప్పుడు కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు ఇది అనుకూలిస్తుందని తెలిపారు.

ప్రజాపనుల శాఖ కార్యాలయంపై లోకాయుక్త దాడులు

బళ్లారి గాంధీ నగర్, జూలై 12: నగరంలోని కోట ప్రాంతంలో ఉన్న ప్రజా పనుల శాఖ కార్యాలయంపై శుక్రవారం ఉదయం లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు డివిజన్ కార్యాలయంలో సోదాలు, రికార్డుల పరిశీలన కొనసాగింది. ప్రస్తుతం బళ్ళారి ప్రజాపనుల శాఖ డివిజన్ పరిధిలో బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, సండూరు తాలూకాలు వస్తాయి. ఈశాఖకు జిల్లా మైనింగ్ నిధి(డీఎంఎఫ్), కళ్యాణ కర్నాటక అభివృద్ధికి బోర్డు నుంచి ఏటా కోట్లాది రూపాయలు సమకూరుతున్నాయి. పనుల నిర్వహణ, కాంట్రాక్టర్లకు పనులు కేటాయింపు, ఇ-ప్రొక్యూర్ మెంట్ తదితర విధానాల్లో అవకతవకలకు అధికారులు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో లోకాయుక్త అధికారులు దాడులు చేసి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. దీంతో పాటు ఇ-ప్రొక్యూర్‌మెంట్ విధానాల్లో పనులు కేటాయింపులో అధికారులు పారదర్శకతకు నీళ్ళొదిలి నాయకుల కనుసన్నుల్లో పనులు కేటాయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. నాయకులు చెప్పిన వారే ఈ-టెండర్లలో పాల్గొనే విధంగా అధికారులు కాంట్రాక్టర్లకు సూచనలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజాపనుల శాఖపై లోకాయుక్త దాడులు నిర్వహించడం చర్చనీయాంశమైంది.

హోసూరు జోన్

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డిమాండ్లపై ఎంపీకి వినతిపత్రం



ఎంపీ గోపినాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్లు

హోసూరు, జూలై 12 : హోసూరు సిప్‌కాట్ ప్రాంతంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఆరు నెలలుగా అంబులెన్స్‌కు డ్రైవర్ లేడని, సిద్ధ ఆయుర్వేద మందుల కొరత ఉందని ఈ డిమాండ్లపై ఎంపీ గోపినాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. ఇక్కడ సుమారు లక్ష మంది ఉద్యోగాలు చేస్తున్నారు. ఎంప్లాయ్‌మెంట్ కార్డులు ఉపయోగించి కార్మికులతో వారి కుటుంబాల వారు కలిసి మూడున్నర లక్షల మంది ఇక్కడ చికిత్స పొందుతున్నారు. వైద్యురాలు గీతా, నందిని , మహేశ్, ఐఎన్‌టీ యూసీ రాష్ట్ర సంస్థ కార్యదర్శి మునిరాజ్, అభివృద్ధి కమిటీ శివకుమార్ స్వయంగా వెళ్లి ఈ ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి ఎంపీ గోపినాథ్ అధ్యక్షత వహించాలని కోరారు. ఈ వినతిని ఎంపీ గోపినాథ్ ఆమోదించారు.

హైవేపై లైటింగ్ సౌకర్యంలేక ఇబ్బందులు

హోసూరూ(సిఫ్‌కాట్) జూలై 12 :హోసూరు సమీపంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతం జూజూవాగీ చెక్‌పోస్టు సమీపంలో లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కావున విద్యుత్ సౌకర్యం కల్పించాలని. ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



చెక్‌పోస్టు వద్దవెలగని లైట్లు

చెక్‌పోస్టుల్లో అక్రమసొత్తు స్వాధీనం

హోసూరు, జూలై 12 : హోసూరు - కోలార్ హైవే , కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రం నుంచి తమిళనాడుకు వచ్చే వాహనాలు, తమిళనాడు నుంచి కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రానికి వెళ్లే వాహనాలు హోసూరు నెల్లూరు చెక్‌పోస్టులో తనిఖీ చేసిన తర్వాతే వెళ్లాల్సి ఉంటుంది. చెక్‌చేసి వెళ్లే టప్పుడు ఇక్కడ లంచం అందుకున్నట్లు కృష్ణగిరి లంచాల నిరోధక పోలీసులకు సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేయగా అక్కడ రూ. 2,89,500 ఉన్నట్లు తేలింది. లెక్కలో లేని ఆ డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న డబ్బు

బాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

హోసూరఉ(కృష్ణగిరి) జూలై 12 : క్రీడలతో పాటు అన్ని రంగాల్లో బాలికలు పాల్గొనేలా ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడలు యువజన సంక్షేమ శాఖ బాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కృష్ణగిరి జిల్లాలోని 40 పాఠశాలలకు చెందిన 600 మంది బాలికలు లాంగ్ జంప్, హైజంప్, రన్నింగ్ సహ పలు పోటీల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమస్థానంలో, సెయింట్ అన్నల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. జాన్‌బాస్కో హైస్కూల్ బాలికలు తృతియ స్థానంలో నిలిచారు. అండర్ ఏజ్ బాలికలు పోటీల్లో జాన్ బాస్కో హై స్కూల్ అన్నిటిల్లో మొదటి స్థానం పొందారు.



అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన బాలికలు

స్లీపర్ కోచ్ ఆర్టీసీ బస్సు బోల్తా.. డ్రైవర్ మృతి

రాయచూరు, జూలై 12 : సింధనూరు నగరంలో శుక్రవారం తెల్లవారు జామున ఆర్టీసీ స్లీపర్ కోచ్ బస్సు ఒకటి బోల్తా కొట్టింది. హుబ్లీ నుంచి రాయచూరువైపు వెళుతున్న బస్సు డ్రైవర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ రాచప్ప(51) అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో 9 మంది ప్రయాణీకులుండగా వారిలో ఒక్కరికి మాత్రమే గాయాలు కాగా మిగిలిన వారంతా చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారికి తాలూకా ఆస్పత్రిలో చికిత్సనందించిన సింధనూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.



బోల్తా పడిన స్లీపర్ కోచ్ ఆర్టీసీ బస్సు ఇదే

హట్టి బంగారుగని వద్ద ప్రమాదం.. కార్మికుడి దుర్మరణం

రాయచూరు, జూలై 12 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి బంగారుగనుల కంపెనీ సొరంగ మార్గంలో శుక్రవారం ఉదయం ప్రమాదం సంభవించింది. అండర్ గౌండ్‌లో ఉన్న మట్టిని తీసే ప్రయత్నంలో అందులో పని చేస్తున్న కార్మికుడు మౌనేశ్(48) పై పెద్ద ఎత్తున మట్టిపెడ్డలు విరిగిపడడంతో ఆయన అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు మరో నలుగురు కార్మికులకు రంగప్ప, బూదెప్ప, పరశురామ్, హనుమంతలకు తీవ్ర గాయాలు కాగా వీరిని బెళగావి ఆస్పత్రికి చికిత్స కోసం పంపారు. మరో ఇద్దరు కార్మికులను జిల్లా కేంద్రంలోని రాయచూరు రిమ్స్ ఆస్పత్రికి చికిత్స కోసం పంపినట్లు గని అధికారులు తెలిపారు. సంఘటనకు సంబంధించి హట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు మౌనేశ్

కార్మికుడి కుటుంబానికి పరిహారం అందజేయాలి

హట్టి గని కంపెనీ అండర్ గ్రౌండ్‌లో మృత్యువాతపడిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం అందజేయాలని సీఐటీయూ రాష్ట్రధ్యక్షుడు ఎండీ అమీర్ అలి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హట్టి గని కంపెనీల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు కంపెనీ యాజమాన్యం విఫలమవుతున్నట్లు ఆరోపించారు.